క్లుప్తంగా

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

చీమకుర్తి: ఏపీటీఎఫ్ చీమకుర్తి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాత్రి చీమకుర్తి ఎన్ఎస్పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా శిరిగిరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆవుల హరిబాబు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మాకినేని శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి బీ రఘుబాబు, యోహాన్‌రెడ్డి, పీ హనుమంతరావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. నూతన కార్యవర్గానికి తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మన మిత్ర సర్వీస్‌కు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయాల సెక్రటరీలు

చీమకుర్తి: మన మిత్ర యాప్ ద్వారా క్లస్టర్ మ్యాపింగ్ సర్వీస్ విధానానికి వ్యతిరేకంగా చీమకుర్తి అర్బన్‌లోని సచివాలయాల సెక్రటరీలందరూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వార్డు సచివాలయాల పరిధిలోని క్లస్టర్‌లను మ్యాపింగ్ చేసే సేవల నుంచి తమను మినహాయించాలని కోరుతూ రాష్ట్ర సచివాలయాల సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందించారు.

మండల స్థాయి స్కూల్ గేమ్స్‌పై పీడీల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ ఆంజనేయులు, పాఠశాలల పీడీలు

మద్దిపాడు: మండల స్థాయిలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో ఆటల పోటీల నిర్వహణకు ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు అధ్యక్షతన స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో పాఠశాలల పీడీలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని, పండుగ వాతావరణంలో క్రీడలు నిర్వహించాలని సూచించారు. మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో వివిధ క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ టి.విజయ్‌కుమార్ (బాబి), పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు బిజినెస్ ఎక్స్‌లెంట్ ఎక్స్‌పోర్ట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శిద్దా సుధీర్‌కుమార్

చీమకుర్తి: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వారు 2025వ సంవత్సరానికి ఉత్తమ బిజినెస్ ఎక్స్‌లెంట్ ఎక్స్‌పోర్టు అవార్డుకు చీమకుర్తికి చెందిన జ్యోతి గ్రానైట్ ఎండీ శిద్దా సుధీర్‌కుమార్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో పరిశ్రమల శాఖామంత్రి చేతుల మీదుగా శిద్దా సుధీర్‌కుమార్ అవార్డు అందుకున్నారు. గ్రానైట్ రంగంలో ఉత్తమ ఎగుమతులు నిర్వహిస్తున్నందుకుగానూ ఆయనకు ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. తనకు అవార్డు రావడానికి గ్రానైట్ వ్యాపారంలో తన తండ్రి శిద్దా రాఘవరావు అందించిన సహకారం, సలహాలు, సూచనలు, మెళకువలే కారణమని ఆయన అన్నారు. తన తండ్రితో పాటు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సుధీర్‌కుమార్‌కు అవార్డు రావడంతో గ్రానైట్ వ్యాపారులు, పలువురు స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

జీతాల కోసం కార్మికుల ఆందోళన

పెద్దదోర్నాల: మేజర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులకు కొద్ది నెలలుగా జీతాలు అందక పోవడంతో ఆర్థికలితో అలమటిస్తున్నారని, వారికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. జీతాలు వెంటనే చెల్లించాలని కార్మికులు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి పిచ్చయ్య, కార్మికులు అచ్చయ్య, దేవమ్మ, కాశయ్య, కిరణ్, పెద్దయేసు, అరుణ్, రైతు సంఘ నాయకులు సోమయ్య, దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు సాగును నియంత్రించాలి

- పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారి సత్య శ్రీనివాస్



మండలంలో నారుమళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి సత్యశ్రీనివాస్‌తో ఫీల్డ్ అసిస్టెంట్లు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లి పొగాకు బోర్డు పరిధిలో గల వెల్లంపల్లి, కొలచనకోట, మల్లవరం, దొడ్డవరం, కుంకుబాడు, బొడ్డువానిపాలెం గ్రామాల్లో పొగాకు నారుమళ్లను ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం విజిలెన్స్ అధికారి సత్య శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అనుభవం దృష్ట్యా 2025–26 పంట కాలానికి నారుమడి దశ నుంచే పొగాకు పంట సాగును నియంత్రించే విధంగా పొగాకు బోర్డు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పొగాకు నారుమడులను వాణిజ్య సరళిలో పెంచే పొగాకు రైతులు, నారుమడుల పెంపకందారులు తప్పనిసరిగా పొగాకు బోర్డు కార్యాలయంలో తమ నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. గరిష్టంగా ఐదు ఎకరాలకు రిజిస్ట్రేషన్ పొందవచ్చని తెలిపారు. నారుమడి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి టీబీఎస్ఆర్ నంబర్, విత్తన రకం, విత్తన మూలం, విత్తిన తేదీ, విస్తీర్ణం వివరాలతో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పొగాకు బోర్డు వద్ద రిజిస్ట్రేషన్ లేకుండా నారుమడులు పెంచే వారిపై బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నారుమడులను ప్రత్యేక అధికారుల బృందం తనిఖీ చేస్తుందని తెలిపారు. ఎఫ్‌సీవీ రకం పొగాకు నారు, పెంపకందారులు బోర్డులో రిజిస్ట్రేషన్ అయిన వారికి మాత్రమే అమ్మాలని, అదేవిధంగా పొగాకు రైతులు బోర్డులో నమోదు చేసుకున్న నారుమళ్ల లోనే నారు కొనుగోలు చేయాలని తెలిపారు. నారు అమ్మకాలకు సంబంధించిన రశీదు పుస్తకాలను పొగాకు బోర్డువారు సరఫరా చేస్తుందని చెప్పారు. రైతులు నారుమడుల పెంపకందారుల వద్ద తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ఆ రశీదును ఫారం-2కు జతచేసి పొగాకు బోర్డు కార్యాలయంలో ఇవ్వాలని ఆయన వివరించారు. అంతేగాకుండా రిజిస్ట్రేషన్‌లేని పొగాకు నారుమడులలో నారు కొనుగోలు చేసిన పొగాకు రైతుల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తామని ఆయన హెచ్చరించారు. పొగాకు నారు లభ్యత గురించి, నారుమడులు పెంచిన పెంపకందారుల వివరాలను బోర్డు అధికారులు తెలుపుతారన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు మోతీలాల్, నవీన్ నాయక్, ఏసుదాసు, నాగేంద్ర, అనిల్ వర్మ, నారుమళ్ల పెంపకందారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానం ప్రధానం

- శాస్త్రీయ విధానం ద్వారా పరిశోధన చేస్తేనే సత్ఫలితాలు
- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి



పాల్గొన్న వివిధ విభాగాల రిసోర్సుపర్సన్లు

ఒంగోలు సిటీ: బోధనాంశాలతో సంబంధం లేకుండా పరిశోధకులు తమ పరిశోధనలను శాస్త్రీయ విధానంలో నిర్వహించినప్పుడు మాత్రమే అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క పరిశోధకుడు తప్పకుండా దృష్టిలో ఉంచుకుని పరిశోధన విషయంలో ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం ఆంధ్రకేసరి యూనివర్సిటీలో గల సమావేశపు హాలులో రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'పరిశోధనా విధానంలో ప్రాథమిక అంశాలు – పరిశోధకుల పాత్ర' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నిర్మలామణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ 'శాస్త్రీయ పరిశోధనలో సిద్ధాంతాలు – సామాజిక శాస్త్ర పరిశోధన, పరిశోధనలో సైన్స్ యొక్క ప్రాథమిక అంచనాలు, పరిశోధనలో సానుకూలత, పరిశోధనలో సామాజిక దృగ్విషయాలు, పరిశోధనలో కారణాల విశ్లేషణ' తదితర అంశాలపై ఉదాహరణలతో కూడిన విశ్లేషణాత్మకమైన సందేశాన్నిచ్చారు. పరిశోధన అంటేనే ఏదో ఒక నూతన విషయాన్ని అన్వేషించడమని, అందులో భాగంగా పరిశోధనలో శాస్త్రీయ పద్ధతిని 16, 17 శతాబ్దాల కాలంలోనే ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. పరిశోధనా విధానం అనేది శాస్త్రీయ దృక్పథంతోనే కొనసాగించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా నేటి పరిశోధకులు సమాచార సేకరణకు ఉపక్రమించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. పరిశోధకులకు పలు మెళకువలు, సలహాలు, సూచనలు చేశారు. నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీలో గత సంవత్సరం జరిగిన ఆర్‌సెట్ ద్వారా వివిధ సబ్జెక్టులలో 52 మంది పరిశోధకులు జాయిన్ కావడం జరిగిందన్నారు. వీరి కోసం 34 మంది పరిశోధన పర్యవేక్షకులు(గైడ్లు)ను నియమించడం జరిగిందన్నారు. ఏకేయూ తరఫున తొలి బ్యాచ్ పరిశోధకులకు ఈ సమావేశం నిర్వహించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఓఎస్డీ, చరిత్ర విభాగం పరిశోధక పర్యవేక్షకుడు ప్రొఫెసర్ గుత్తి రాజమోహన్‌రావు, ఎడ్యుకేషన్ విభాగం హెడ్ డాక్టర్ ఏ అమృతవల్లీదేవి, సీఈ ప్రొఫెసర్ గోదేశి సోమశేఖర, ఏసీఈ డాక్టర్ అంచుల భారతీదేవి, సీడీసీ విభాగం మాజీ డీన్, చరిత్ర విభాగం పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ దొడ్డా వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, పలు విభాగాల సహాయక ఆచార్యులు, ఆర్అండ్‌డీ విభాగం సిబ్బంది, ఏకేయూ బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, ఏకేయూ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



జాన్‌పాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్‌ను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. జాన్‌పాల్‌ను ఒంగోలులోని ఆయన స్వగృహంలో కలిసిన ఎమ్మెల్యే.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి, పెద్దారవీడు జెడ్పీటీసీ ఏరువ చలమారెడ్డి, కోటిరెడ్డి ఉన్నారు.

గుంటి గంగ ఆలయ ఆదాయం రూ.6.82 లక్షలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



గుడి ఆదాయన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారి ఆలయానికి సంబంధించి వివిధ రూపాల్లో భక్తుల నుంచి 150 రోజులకు వచ్చిన ఆదాయం సుమారు రూ.6.82 లక్షలని ఈవో గుంటపల్లి వాసు శుక్రవారం తెలిపారు. హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనంత సత్యనారాయణ పర్యవేక్షణలో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు లెక్కించారు. తొలుత అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో గుంటపల్లి వాసు, చైర్మన్ గురుబ్రహ్మం, ఆర్‌ఏ కె.ప్రసాద్‌రావు, పూజారి కామేశ్వర శర్మ, ఆలయ అర్చకులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి, ఆలయ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న జవహర్ నాయక్

పుల్లలచెరువు: మండలంలోని ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్వాలిటీ కంట్రోల్ అధికారి జవహర్ నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఎరువులు, పురుగుమందులను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు, ఓపీ ఫారాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన సేవలు అందజేయాలన్నారు. ప్రతి దుకాణదారుడు ప్రభుత్వంతో అనుమతి పొందిన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని చెప్పారు. ప్రతి షాపులో ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, రైతులు కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా రసీదులు అందజేయాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలలో వైద్య శిబిరం

దర్శి: నగర పంచాయతీ పరిధి శివరాజ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కాశీ చేతన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో ప్రైవేటు వైద్య శాలల్లోని ప్రముఖ వైద్యులు బాదం వెంకట హర్షవర్ధన్‌రెడ్డి, మేడికొండ మల్లారెడ్డి, సాయిమణింధర్‌రెడ్డిలు ఉచిత సేవలందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, చైర్మన్ దేవతి వరప్రసాదరావు, అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

లక్కవరంలో వైద్య శిబిరం



జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది



ఈ నెల 11న సాక్షి పత్రికలో ప్రచురించిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: మండలంలో విజృంభిస్తున్న విషజ్వరాలతో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందుల గురించి, వైద్యాధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ 'మంచం పట్టిన తాళ్లూరు' శీర్షికతో ఈ నెల 11వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని లక్కవరంతో పాటు పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యం విషయంలో సమస్య ఏమైనా ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. హెచ్ఓ కె. చంద్రశేఖరరావు, ఎంఎల్‌హెచ్ పి.వంశీ నాయక్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక డిమాండ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

మద్దిపాడు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మద్దిపాడు మండల అధ్యక్షుడు డి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈమని శ్రీనివాసరావు, జిల్లా శాఖ కార్యదర్శి పి.శేఖరరెడ్డి శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నంబర్ 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను, అస్సెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దార్ శాంతికి వినతిపత్రం



తహసీల్దార్ శాంతికి వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

కొత్తపట్నం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఉపాధ్యాయులు శుక్రవారం తహసీల్దార్ శాంతికి వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పీఆర్సీ రద్దు చేస్తామని నమ్మబలికి నట్టేట ముంచిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌సీహెచ్ సుబ్బయ్య, సీహెచ్ మస్తాన్, కార్యకర్తలు అంజనీదేవి, సుజాత, చార్లెస్, ఆర్.వెంకటేశ్వరరావు, రోజారావు, సుబ్రహ్మణ్యం, శివన్నారాయణ, విజయభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు జమ చేయించాం.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి



వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: చెత్త సంపద కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి కావాల్సిన రూ.3.56 లక్షలను చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖకు జమ చేయించామని, కానీ కూనంనేనివారిపాలెంలోని చెత్త సంపద కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు విద్యుత్ శాఖ ఎస్ఈని ప్రశ్నించారు. శుక్రవారం ఒంగోలులో నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మాట్లాడారు. ఎస్టిమేషన్ చార్జీలు పెరినందున మండల పరిషత్ కార్యాలయం నుంచి జమచేయించిన రూ.3.56 లక్షలు సరిపోవని, మళ్లీ రీ ఎస్టిమేషన్ వేయించి అదనపు నిధులు జమచేయాలని ఎస్ఈ తెలిపారు. గతంలో రూ.3.56 లక్షల ఎస్టిమేషన్ వేసిన తర్వాత నిధులు జమచేశామని, ఇప్పుడు మళ్లీ రీ ఎస్టిమేషన్ వేస్తే మళ్లీ విద్యుత్ డిపార్టుమెంట్ వారు కనెక్షన్ ఇవ్వబోయేసరికి రీ ఎస్టిమేషన్ చార్జీ కూడా మళ్లీ పెరిగిపోతుందని అన్నారు. ఇలా ఎస్టిమేషన్ వేసుకుంటూ పోతుంటే విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారోనని జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఎస్ఈని అడిగారు.

లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

చీమకుర్తి: రాష్ట్ర సీఐటీయూ సంఘం పిలుపు మేరకు ఈ నెల 15వ తేదీ విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి చీమకుర్తి మండలం నుంచి కార్మికులు తరలిరావాలని పిలునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఇప్పటికే బోర్డుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం వాడుకుందని, వాటిని తిరిగి జమచేయాలని డిమాండ్ చేశారు. తొలుత కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, రాజశేఖర్, రాము, సుబ్బారావు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలూ పంచుకుంటాం..



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై

దర్శి: యూటీఎఫ్ ఆధ్వర్యంలో హక్కులతో పాటు బాధ్యతలను కూడా పంచుకుని సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.అబ్దుల్ హై సూచించారు. మండలంలోని చిన్న ఉయ్యాలవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశమయ్యారు. సమావేశానికి మండల విద్యాశాఖాధికారులు కాకర్ల రఘురామయ్య, రమాదేవిలు ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శులు టి.రాజశేఖర్, మీనిగ శ్రీను గౌరవ అతిథులుగా హాజరయ్యారు. చిన్న ఉయ్యాలవాడకు చెందిన ఎస్ఎంసీ చైర్మన్ నారాయణ 30 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామస్తులు అయ్యప్ప విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అబ్దుల్ హై మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు ఎప్పుడూ హక్కుల కోసం మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా పంచుకుంటామనేందుకు నిదర్శనంగా నారాయణ పని చేస్తున్నారని కొనియాడారు. తాను పాఠశాలకు వచ్చిన మూడు నెలల్లోనే గ్రామస్తులతో మమేకమై ఈ కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమని చెప్పారు. ఇదే చొరవతో గ్రామస్తులు సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. గ్రామస్తులు అయ్యప్ప తదితరులు మాట్లాడుతూ పాఠశాల మండలానికి సుదూరంగా ఉందని, పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తే గ్రామానికి చెందిన విద్యార్థులందరినీ ఈ పాఠశాలకు పంపిస్తామని కోరారు. ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి మాట్లాడుతూ మండలంలో ఏ నిధులు వచ్చినా మొదట ఈ పాఠశాలకు కేటాయిస్తామని, గ్రామస్తులంతా కలిసికట్టుగా పాఠశాలను అభివృద్ధి చేసుకుని పిల్లలను బాగా చదివించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దర్శి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, ముండ్లమూరు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు భారతి, రాజంపల్లి ప్రధానోపాధ్యాయుడు వెన్నెల శ్రీనివాసరావు, యూటీఎఫ్ కార్యకర్తలు ఏడుకొండలు, కృష్ణ, సుబ్బారావు, కిషోర్, షాసులాషా, రాంబాబు, రాజ పాల్గొన్నారు.